ఓంశ్రీసాయిరాం

స్వబోధే నాన్యబోధేచ్ఛా బోధరూపతయాత్మనః
న దీపస్యాన్యదీపేచ్ఛా తథాస్వాత్మా ప్రకాశతే.

విద్యార్థులారా!

ప్రకాశముగా వెలుగుచున్న జ్యోతిని చూడవలెనన్న మరొక జ్యోతిని మనం వెతుక నక్కరలేదు. అట్లే స్వప్రకాశముగా వెలుగుతున్న ఆత్మజ్ఞానమును వెతుకుటకు మరొక జ్ఞానము అక్కరలేదు. ప్రతి మానవుడు స్వస్వరూప జ్ఞానము కలిగినవాడే. అట్టి దివ్యమైన, భవ్యమైన జ్ఞానతత్త్వాన్ని మానవుడు గుర్తించుకోలేకపోవటం చేతనే అన్య జ్ఞానములకై ఆరాటపడుతున్నాడు మానవుడు. సృష్టిలో కనిపించుచున్న బేధములన్నీ అబేధ వస్తువుయొక్క అభివ్యక్తమే. బేధాబేధములకు కేవలము ఒకే కారణము. అస్థిర పదార్థములన్నీ స్థిరస్థిరమైన దీనిపైన ఆధారపడి ఉన్నది. సృష్టి అంతయూ ఒక నాటక రంగము. సూత్రధారి, పాత్రధారి భగవంతుడే. అన్ని రూపములతో భగవంతుడే వేషములు ధరించి ఉన్నాడు. ప్రపంచములోని సమస్త రూపములు భగవంతునియొక్క వేషములే. నిన్ను ఎవరైనా తెగడినా, పొగడినా భగవంతుడు ఆ రూపముతో నిన్ను తెగడుచున్నాడు, పొగడుచున్నాడు అనే సత్యాన్ని గుర్తించాలి. జగత్తులోని మంచిచెడ్డలన్నియూ భగవంతునియొక్క చైతన్యస్వభావములే. కాని, మానవుడు ఈ అంతర సత్యాన్ని గుర్తించలేక ఎవరో నన్ను దూషిస్తున్నారు, ఎవరో నన్ను భూషిస్తున్నారని కృంగిపొంగుతున్నాడు. కాదు కాదు. ఆ వేషమును చూసి మీరు మోసపోకూడదు. అన్ని వేషములకు భగవంతుని ప్రతిబింబమే ఈ నాటకమునాడించుచున్నది. ఈ సత్యాన్ని ప్రతి వ్యక్తి గుర్తించవలసిన విషయము. రూపనామములు, వేషభాషలు వేరువేరుగా కనుపించుచున్నప్పటికీ అందరూ ఒకే మానవత్వానికి సంబంధించిన వ్యక్తులనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి.

అన్నీ భగవదంశములే. 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః'. అన్నీ నా అంశములే యని భగవంతుడు ఉచ్చరిస్తున్నాడు. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ప్రేమయే అతని స్వభావము. అతని ప్రేమయే ప్రపంచమంతా ప్రకటితమౌతున్నది. అందియందున్న ప్రేమ ఒక్కటే. భగవంతుడు యేవిధముగా తన ప్రేమను ప్రకటితము గావించుచున్నాడో అట్లనే ప్రతి మానవుడు తన ప్రేమను ప్రకటితము గావించాలి. అవాఙ్మానస గోచరం ప్రేమ అన్నారు. అనిర్వచనీయం ప్రేమ అన్నారు. ఈ ప్రేమను మేథాశక్తితోగాని, యుక్తితోగాని పొందుటకు వీలు కాదు. ప్రకాశించే సూర్యుని ప్రకాశించే సూర్యుని ద్వారానే చూడాలి. అట్లే ప్రేమస్వరూపుడైన భగవంతుని ప్రేమ ద్వారానే పొందాలి. దానికంటె మరొక విలువైనది ఈ జగత్తునందు కానరాదు. కాని, భగవంతుడు గుణాతీతుడు. కనుకనే, తన ప్రేమ గుణాతీతమైనది. కాని, దుదృష్టవశాత్తు యీనాటి మానవుని ప్రేమ గుణముతో కూడినదగుటచే రాగద్వేషములకు అవకాశమునందిస్తున్నాడు. మనము ఒకవిధమైన ప్రతిఫలాపేక్షచే ప్రేమించుచున్నాము. ప్రతిఫలాపేక్షతో ప్రేమించే ప్రేమ ఒక వ్యాపారంగా తోస్తుంది. ప్రేమ వ్యాపార సంబంధమైనది కాదు. ఇది కేవలము అప్పు యివ్వటము, అప్పు తీసుకోటము కాదు. ఇట్టి పవిత్రమైన ప్రేమను పొందవలెనన్న పవిత్రమైన భావము చేతనే పొందాలి.

ప్రేమ ఒక దిక్సూచి వంటిది. ఈ దిక్సూచి ఎక్కడ పెట్టినా ఉత్తర దిశనే చూపుతుంది. అదేవిధముగా మానవుని ప్రేమ ఎట్టి పరిస్థితులందైనా భగవంతునివైపు మరల్చాలి. అదే నిజమైన ప్రేమ. కష్టములకు, విచారములకు, దుఃఖములకు, ఆనందమునకు, ఆహ్లాదమునకు, ఆదాయమునకు పొంగటము ప్రేమయొక్క లక్షణము కాదు. ప్రేమకు తరతమ బేధములు లేవు. మానవుడు ధనమును ఏ వ్యాపారముచేతనో, ఏ ఉద్యోగముచేతనో సంపాయించినట్లుగా, మానవుడు తన ప్రేమ ప్రకటితము ద్వారానే ప్రేమను సంపాయించాలి. కనుక, ప్రేమ ఇట్టి మార్గములో, అట్టి మార్గములో సాధనలు సల్పిన లభించునని భావించటము కేవలము ఒక బలహీనతే. సాధనలచేత లోకసంబంధమైన ఫలితములు మనము సాధించ వచ్చునేగాని, దైవసంబంధమైన ప్రేమతత్త్వాన్ని ప్రేమచేతనే సాధించాలి. భగవంతుని ప్రేమతత్త్వము యిట్టిది, అట్టిది అని ఎవరు వర్ణించుటకు భాష లేదు. ఇది కవిత్వమునకు అతీతమైనది. కనుక, భావాతీతం, త్రిగుణ రహితం అన్నారు. నీటిలో పూర్తిగా మునిగిన వ్యక్తి ఎవరితో మాట్లాడ లేదు. గొంతు వరకు నీటిలో మునిగినప్పుడు కొంతవరకు మాట్లాడుటకు వీలవుతుంది. ఈనాడు లోకములో భగవంతుడు ఇట్టిది అట్టిది ,ఇట్టివాడు అట్టివాడు అని చెప్పటం కేవలం సంపూర్ణంగా ఆనందమును అనుభవించని వ్యక్తి బోధించే బోధలే. నిజంగా భగవంతుని ప్రేమతత్త్వాన్ని చవిచూచిన వ్యక్తులు వర్ణించుటకు వీలుకాదు. కనుకనే, వేదము 'యతోవాచా నివర్తంతే అప్రాప్యమనసా సః' మనస్సుకుగాని, వాక్కునకుగాని అతీతమైనది భగవంతుని ప్రేమతత్త్వము. ఈ ప్రేమ తమోగుణమునకుగాని, రజోగుణమునకుగాని, సాత్వికగుణమునకుగాని సంబంధించినది కాదు. తమోగుణమువలె మొరటైనదిగాని, మొద్దైనదిగాని, క్రోధముతో కూడినదిగాని కాదు. సాత్వికమువలె చల్లగా, నున్నగా ఉండేది కాదు. గుణములతో ఈ ప్రేమను యేవిధముగా పోల్చుటకు వీలుకాదు. భగవంతుని ప్రేమ నిర్మలమై, నిశ్చలమై, నిస్వార్థమై ఉండే ప్రేమ.

'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, నిర్మల స్వరూపిణం' అన్నారు భగవత్ప్రేమను. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్త్వమును ప్రతి వ్యక్తి గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రాచీన ఋషులు యిట్టి పవిత్రమైన ప్రేమనే ఆత్మ అని పిలుస్తూ వచ్చారు. ఆత్మ వేరు భగవంతిని ప్రేమ వేరుకాదు. ప్రేమయే ఆత్మ, ఆత్మయే ప్రేమ. ఇట్టి భగవత్స్వరూపమైన ఈ ప్రేమతత్త్వాన్ని ప్రతి మానవుడు గుర్తించటం అత్యవసరం. ఆ ప్రేమయొక్క అంశ మానవునియందు ఉంటున్నది. ప్రేమ లేని మానవుడు కనిపించడు. కనుక, ప్రేమ లేని జీవితము కేవలము నిర్జీవమైన జీవితమే. అట్టి ప్రేమను తాను పొందినప్పటికీ ప్రేమను గుర్తించుకోలేని మూర్ఖత్వము యేవిధంగా చెప్పాలి. కాని, దురదృష్ట వశాత్తు పవిత్రమైన ప్రేమను విస్మరించి దీనికి విరుద్ధమైన ద్వేషము, అసూయ, డంభము, ఆశలు ఇలాంటి వాటితో మానవుడు ప్రవర్తిస్తున్నాడు. మానవునకు యిట్టి దుర్గుణములు, దురాలోచనలు, దుచ్చింతలు అసహజమైనవి. ప్రతి మానవుడు ఈ ప్రేమతత్త్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించాలి. ఇది మానవునియందు మాత్రమే కాదు, పశుపక్షి మృగాదులందుకూడా ఉంటున్నాది. కనుకనే, 'ఈశావాస్యమిదం జగత్' జగత్తంతయూ ఈశ్వరస్వరూపమే. ప్రేమయే ఈశ్వరత్వము. ఇట్టి ఈశ్వరత్వమును మనం గుర్తించుకోలేకపోయినప్పుడు మానవుడని చెప్పుకోటం సరైన అర్హత కాదు. ఈ ప్రేమ సర్వత్రా ఉంటున్నాది. కుమనస్సునందు, సుమనస్సునందు, తోటలో, బాటలో, కోటలో, మాటలో, సాహిత్యములో, సంగీతములో, మదియందు, గదియందు ఉంటున్నాది. ఇట్టి సర్వత్రా వాయపించిన ప్రేమతత్త్వమును మానవుడు గుర్తించ లేకపోయినప్పుడు యింక మానవత్వమే వ్యర్థమైపోతుంది. మానవుడు సర్వత్రా ఉండిన స్వస్వరూపమును తెలుసుకోలేకపోయినప్పుడు యింక దేనిని తెలుసుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు? ఈనాటి మానవునకు ధనమే ప్రధానము, పదవే ఆధఆరము. కాని, ధనము, పదవి క్షణికమైనవి. ప్రేమలేని హృదయము పాషాణ హృదయము. ప్రేమలేని హృదయము కఠిన హృదయము. ప్రేమలేని హృదయము విషమయము. ఇలాంటి పాషాణ హృదయము, ఇలాంటి కఠిన హృదయము ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము?

చదువు వలన లేదు తర్కవాదమందు లేదు
ప్రాకృతమైన తెలివిచేటలందు లేదు
వివిధ మతములందు వేదవాదమందు లేదు
కలదు కలదు కలదొక్క జాలి హృదయమందె.

ఆ జాలి హృదయము ప్రతి మానవునకు అత్యవసరము. ఈ జాలి హృదయము లేని మనిషి ఎన్ని చదువులు చదివి, ఎన్ని పదవులు ఏలి, ఎంత ధనమునార్జించికూడను ప్రయేజమనం ఏమిటి?

విద్యార్థులారా! మీరు పదవులనాశించవచ్చు. ధనమునాశించవచ్చు. కాని, అన్నింటికి మూలాధారమైన భగవత్ప్రేమను మొట్టమొదట ఆర్జించాలి. అర్థము చేసుకోవాలి. ఈనాటి మానవులకు ఈ ప్రేమ అంతర్భూతము కాక అంతర్మయమైనప్పుడు ఈ మానవత్వములే ఉండిన దివ్యత్వము వివిధ మార్గములలో ప్రకటితమౌతున్నాది. ప్రతి మానవుడు అన్ని మార్గములందు ఈ ప్రేమతత్త్వాన్ని ప్రకటితము గావించాలి. ఈ ప్రేమతత్త్వాన్నే ప్రకటన చేయకుండిన మానవత్వమే వ్యర్థము. ఈనాటి మానవుడు అహంకారము, అసూయ, ఆడంబరము ఈ మూడు రాక్షసుల చేతిలో చిక్కుబడి ఉంటున్నాడు. ఇట్టివాడు మానవుడు అని ఎట్లా చెప్పవచ్చు. మానవత్వమునకు ఈ అహంకారము, ఆడంబరము, అసూయ అనే మూడు రాక్షసులనుంచి ఏనాడు తప్పించెదరో ఆనాడే వాడు నిజమైన మానవుడు. ఈనాడు భక్తి, భక్తి అని అంటున్నాము. ఏమిటి ఈ భక్తి? కేవలము రాగతాళములతో కూడిన భజనా భక్తి? యోగము అంటే ఏమిటి? ముక్కు మూసుకొని మూల కూర్చొని తూగటమా యోగము? జ్ఞానమంటే ఏమిటి? అనేక గ్రంథములు చదివి అందులో ని శ్లోకములు కంఠస్థము చేసుకొని వర్ణించటమా జ్ఞానము? సన్యాసము అంటే ఏమిటి? కాషాయ వస్త్రము ధరించటమే సన్యాసమా? భక్తి అనగా రాగద్వేష అసూయాదుల రహితమై అతీతమైన ప్రేమతత్త్వమే భక్తి. భక్తి భక్తి అని ఏ మానవుడు అహంకారముతో విఱ్ఱవీగుతున్నాడో, అసూయతో జీవిస్తున్నాడో, ఆడంబరముతో బ్రతుకుతున్నాడో వాడు భక్తుడే కాదు. ఇలాంటి వాని సమీపమునకు భక్తి ప్రవేశించదు. ఈ మూడింటి అతీతమైన స్థితికి తాను వెళ్ళి ప్రశాంతమైన ఆనందముతో ప్రేమించాలి భగవంతుని. అప్పుడే

*నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం*
*ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యమ్*
*ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం*

ఆ స్థితియందుండినదే భక్తి అనిపించుకోటానికి వీలవుతుంది. యోగమంటే ఏమిటి? హఠ యోగమని, క్రియా యోగమని ట్రాన్సడెంటల్ మెడిటేషన్ అని యిలాంటి పేర్లు పెడుతున్నారు. అది కాదు యోగము. 'యోగః చిత్త వృత్తి నిరోధకః' ఇంద్రియ నిగ్రహమే నిజమైన యోగము. ఏవిధమైన ఉద్రేకమునకు అవకాశమునందించకూడదు. ఇతరులు మనలను తెగడినా, పొగడినా

కృంగిపోక, పొంగిపోక ఉంటుండాలి. ఇట్టి ఇంద్రియ నిగ్రహమే నిజమైన యోగము. జ్ఞానమనగా ఏమిటి? అద్వైత దర్శనం జ్ఞానం. నా ఆత్మయే అన్ని భూతములందు ప్రతిబింబి స్తున్నాదనే ఏకాత్మ భావమే నిజమైన జ్ఞానము. సన్యాసమంటే ఏమిటి? గుణము మారాలి కాని గుడ్డలు మారితే ప్రయోజనము లేదు. మనసు మారాలి గాని మనిషి మారితే ప్రయోజనం లేదు. తాను సర్వేంద్రియములను అరికట్టి సర్వసంగ పరిత్యాగి అయినవాడే సన్యాసి. ఈనాడు సన్యాసులకు ఉండినన్ని ఆశలు గృహస్థునకు లేవు. ఏమిటి ఈ ఆశలు? ఎవరికోసం ఈ ఆశలు? ఇదంతా

తొమ్మిది చిల్లుల తోలు తిత్తియెగాని
కాంతి కల్గిన వజ్రఘటము కాదు
నిమిష నిముషమునకు నీచులూరునెగాని
పునుగు జవ్వాదీలు పుట్టబోవు
కడుపులోన మలము కడమెల్ల ఎముకలు
తలచి చూడ పైన మురికి తోలు...

*మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం*
*చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం*
*బులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని*
*శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.*

అది నిజమైన సన్యాసము. మరణమునకు భయపడకూడదు. అభివృద్ధికి పొంగిపోరాదు. ఏమిటి ఈ అభివృద్ధులు, మరణాలు. ఇవి కేవలము జీవితములో తరంగాలు. సముద్రములో వచ్చే తరంగాలు. పుట్టిన వానికి చావు తప్పదు. కనుక, ఈ రెండింటికి విచిత్రంగా విచారించనక్కరలేదు. ఐతే ఈ ప్రాకృతమైన జగత్తునందు, ఈ భౌతికమైన జగత్తునందు, ఈ లౌకికమైన జగత్తునందు జీవించేంత వరకు మంచి ఆదర్శవంతమైన జీవితంగా మనము జీవించాలి.

కాని, ఈనాటి విద్యార్థులు ఈ భౌతిక ప్రభావములందు మునిగి, ఈ లౌకిక వాంఛలలో మునిగి కేవలము తాత్కాలిక జీవితము గడిపే నిమిత్తమై ప్రయత్నిస్తున్నారు. తదివిన చదువులు దేని నిమిత్తము? పొట్టకూటికా! కాదు, కాదు. పొట్టకూడు కూడా అవసరమే. కాని, చదివిన చదువును పదిమందికి ఆదర్శవంతమైన దీనిలో అందించాలి.

*సత్ప్రవర్తన సద్బుద్ధి సత్యనిరతి*
*భక్తి క్రమశిక్ష కర్తవ్యపాలనంబు*
*నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు*
*సత్యమును తెల్పు మాట శ్రీసాయి మాట.*

అందరికీ తెలుసు. భారత దేశమందు అతి లేత వయస్సునందే అద్వైత సిద్ధాంతము ప్రకటించి, స్థాపించి అద్వైత ప్రబోధలు బోధించిన ఆదిశంకరులవారు కేవలము జ్ఞానము వల్లనే మోక్షము అన్నాడు. 'సత్యంజ్ఞానమనంతంబ్రహ్మ' అన్నాడు. శివానందలహరి వ్రాసి జ్ఞానము ఒక్కటే తరించటానికి మార్గము అన్నాడు. జ్ఞానముయొక్క లక్ష్యము ఆనందమే. ఆనందమునకు భగవంతుడే కారణము. రెండవ వస్తువు లేనే లేదు. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అన్నాడు. ఇంత అద్వైత సిద్ధాంతము బోధించిన ఆదిశంకరులకే తిరిగి భక్తి అవసరమైంది. ఈ భక్తిలో ప్రవేశించక ఏ జ్ఞానము మనము పొందలేము.

యోగరతోవా భోగరతోవా సంఘరతోవా సంఘవిహీన
యస్యబ్రహ్మణ పిబతే చిత్తం నందతి నందతి నదత్యేవ ।భజగోవిందం।

ఓ ప్రజలారా! యోగముగాని, మరి యేసాధనలు చేసి ప్రయోజనం లేదు. భజ గోవిందం. హరిని భజించు. దైవాన్ని చింతించు. అదే నిన్ను తరింప చేయటానికి రాజబాట. అద్వైతమత స్థాపకులైన శంకరులవారుకూడా కట్టకడపటికి భక్తిలో ప్రవేశించారు. భక్తి అనేది ఎంత ఉత్తమమైనదో మీరు విచారించవచ్చు. భక్తికి మించినది మరొకటి లేదు.

ఎన్ని విద్యలు నేర్చినా ఈ ప్రేమతత్త్వమనే రసామదతమే లేకపోతే యివన్నీ వ్యర్థమైనవి.

రసము లేని ఫలమువలె
ఫలములేని వృక్షమువలె
వాసనలేని పూవువలె
పుట్టిగిట్టి ఏమి ఫలము?
పుట్టెరిగిన పుట్టినావు

నీవెవరో తెలియకున్న
నీవెరిగినదేమన్నా?

కాదు, కాదు. నీవు పుట్టినావు. పుట్టుకయొక్క ప్రధానమైన కాఅణమును, కర్తవ్యమును గుర్తించాలి. ఎందుకోసం నీవు ఈ జగత్తులోకి వచ్చావు? ఎందుకు చింతిస్తున్నావు?

పుట్టినపుడు ఏడ్చినారు చచ్చినపుడు ఏడ్చినారు
మధ్యమధ్య విషయాలకు ఎందుకెందుకొ ఏడుస్తారు
ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార?
సత్యస్వరూపునికై ఏడ్చినార ఎపుడైన?
ఎందుకోసమేడ్చినారు? ఏడ్పుకోసమేడ్చినారు

కాదు, కాదు. మనం ఏడ్వవలసింది ఒక్క దైవం కోసమే. అదే రామకృష్ణుడుకూడా చెప్పాడు. బ్రహ్మసమాజము వారొచ్చి ప్రశ్నించారు రామకృష్ణుని, 'రామకృష్ణా! నీవు దైవాన్ని చూచావా?' 'ఆ! చూచాను. చూస్తున్నాను. మాట్లాడుతున్నాను. అతనిలోనే జీవిస్తున్నాను. అతనితోనే తిరుగుతున్నాను. అతనియందే ఉంటున్నాను' అన్నాడు రామకృష్ణుడు. ఓవిధంగా అతనితో తిరుగుతున్నావు? అతను ఎక్కడున్నాడు? మాకు కనిపించటం లేదు. 'ఒరే పిచ్చివాడా! నీవు ధనం కోసం ఏడుస్తున్నావు. కీర్తికోసం ఏడుస్తున్నావు. చదువు కోసం ఏడుస్తున్నావు. సంసారం కోసం ఏడుస్తున్నావు. ఇతరుల కోసం ఏడుస్తున్నావు. దైవం కోసం ఏడుస్తున్నావా? దైవం కోసం ఏడు, తప్పక నీకు కనిపిస్తాడు'. చిల్లర చిల్లర విషయాలకంతా ఏడుస్తున్నాడు. జీవితమునకు ప్రాణ సమానమైన దైవం కోసం ఏమాత్రం ఏడ్వటం లేదు. దైవము నిమిత్తమై యేమాత్రం విచారించటం లేదు. అది లేనప్పుడు ఎన్నింటికి యేడ్చి యేమి ప్రయోజనం. ఇది ఏడ్పు కోసం ఏడ్చినట్లే. మనము దైవ కృపకు, ధర్మ కృపకు దాసులు కావాలి. ధర్మాన్ని మనం సాధించాలి. సత్యాన్ని మనం పలకాలి. దేశరక్షణ కాదు ముఖ్యము. సత్యధర్మములను రక్షించినప్పుడు ఆ సత్యధర్మములే దేశాన్ని రక్షిస్తాయి. కనుక, మనము నేర్చిన విద్య సత్యధర్మమార్గంలో ప్రవేశపెట్టాలి.

విద్యార్థులారా! ఈనాడు మీరు బహుమతులు పొందారు. ఏమిటి బహుమతి అంటే అర్థం? బహుమతి అనగా ఎన్నో మతులని అర్థము. ఒక మతి ఉంటేనే ఇన్ని చింతలకు గురౌతున్నావు. బహుమతులుంటే నీ గతి యేమైపోతుంది? నీవు బహుమతినుంచి ఏకమతి కావాలి. ఆ ఏకమతి అయినప్పుడే దైవముయొక్క అనుగ్రహమనే బహుమతి నీవు పొందుతావు. అట్టి ఏకమతిని నీవు సాధించటానికి నీవు ప్రయత్నించాలి. ఆ ఏక మతి ఒక్క ప్రేమ ద్వారానే లభ్యమవుతుంది. నా యందున్న ప్రేమయే వీరియందు, వీరియందున్న ప్రేమయే వారియందు, అందరియందున్న ప్రేమ ఒక్కటే అనే ఏకాత్మ భావాన్ని గుర్తించాలి. ఇట్టి ప్రేమతత్త్వాన్ని ప్రతి వ్యక్తి గుర్తించి అర్థం చేసుకోవాలి. ఈ ప్రేమతత్త్వము ఒక్క దైవప్రార్థన చేతనే లభ్యమౌతుంది. ఈ ప్రార్థనకూడా కేవలం ఆడంబరంగా అహంకారముతో చేస్తే కాదు. హృదయపూర్వకంగా అంతరాత్మలో పొంగాలి. అట్టి తత్త్వన్ని ఎప్పుడు పొందుతాము? మన హృదయం పరిశుద్ధము గావించికోవాలి.

దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న
పొంచి చూచుకనులున్న పంచల విను మనసున్న
వంచన గుణ చిత్తమున్న వంచించే పలుకున్న
ఈ వికృతులు చూడగనే న్యాయమింక బ్రతుకదన్నా
ఏ గుణంబును హృదయంబున నిలువదన్నా.

ఈనాడు న్యాయం లేకుండాపోవటానికి కారణం ఏమిటి? దుర్బుద్ధుల మనస్సు, దూరులు వినే చెవులు, పొంచి చూచే దృష్టి. అన్నీ దుర్బుద్ధులు, దురాలోచనలు, దుచ్చించలే ఉంటున్నాయి. అన్నింటికీ మూల కారణం అహంకారమే. అహంకారమనే రాక్షసుని మనలో ప్రవేశించకుండా చూసుకోవాలి. దేనిని చూచి నీకు అహంకారము? ఇంత పెద్ద విశ్వములో నీవు ఎంత మాత్రము వాడవు. చూడండి. ఇంత పెద్ద విశలమైన ప్రపంచములోపల ఇండియా ఎంత ఉంటున్నాది? ఈ ఇండియా లోపల అనంతపురం జిల్లా ఎంత ఉంటున్నాది? ఈ అనంతపురం జిల్లాలోపల ఈ పుట్టపర్తి గ్రామం ఎంత చిన్నది? ఈ పుట్టపర్తి గ్రామంలో నీవు ఎంతవాడవు! ఇంత చిన్నవాడైన నీవు యింత విశ్వమును చూచి గర్వించటం సిగ్గుచేటు కదా! నీకు అహంకారమునకు ఎక్కడ కారణం వుంచున్నాది? పోనీ 'అంతా నేనే' అనే ఏకాత్మభావం వచ్చినప్పుడు ఎవరిని చూచి నీవు అహంకారపడతావు? రెండవ వస్తువు లేదు. కనుక, అప్పుడుకూడా అహంకారపడుటకు అవకాశము లేదు. అహంకారము కేవలము రక్షసగుణము. కొంతమంది పదవులతో, ధనముతో విఱ్ఱవీగి అహంకారముతో ఉంటారు. అహంకారము వానిని పతనము చేయటానికి పుట్టే మహా రోగము. ఇతరులను మనం గౌరవించాలి.

ఇతరుల దగ్గర మనం గౌరవమునందుకోవాలి. నీవు ఇతరులను గౌరవించక ఇతరులు నిన్ను గౌరవించాలంటే ఎట్లా గౌరవిస్తారు? విద్యార్థులు మొట్టమొదట తెలుసుకోవలసింది ఇదే. ఇతరులను గౌరవించు. ఇతరుల గౌరవము అందుకో. ఇతరులకు ప్రేమపూర్వక నమస్కారమందించు. ఇతరులుకూడా నమస్కారమందిస్తారు. దీళీ ళీదీలి గీబిగి శిజీబితీతీరిబీ, వీరిఖీలి బిదీఖి శిబిదిలి. నీవు మొట్టమొదట యితరులను గౌరవించకుండా యితరులు నిన్ను గౌరవించాలంటే ఎందుకు గౌరవిస్తారు? కుక్కలుకూడా గౌరవించవు. మొట్టమొదయ నీవు వినయవిధేయుడు కావాలి. విద్యావినయ సంపన్నే. వినయముండిన వానికే విద్య లభ్యమౌతుంది. అలాంటి వినయవిధేయతలు లేనివాడు కేవలము రాక్షసునితో సమానం. అలాంటి వాడు ఎన్ని చదువులు చదివి ఏమి ఫలము?

ఎన్ని చదులు చదివి యేమి ఫలము
తన్నొసట వ్రాత తప్పింప నెవరి తరము
చెడ్డ బుదు&ధలు తన దరి చేరెనేని
ఎండబారును బుదు&ధలు బండబారు.

అలాంటి బుద్ధులు మనకుండి ప్రయోజనం ఏమిటి?

విద్యార్తులారా! ప్రపంచములో ఎన్నో యూనివర్సిటీలు ఉన్నాయి. విద్యా సంస్థలుంటున్నాయి. కాని, మన విద్యాసంస్థకు బయటి విద్యాసంస్థలకు వ్యత్యాసము మన ప్రవర్తనలో నిరూపించాలి. దానికి తగిన గురువులు గాని, అధికారులుగాని ఆదర్శవంతులుగా నిరూపించాలి. అధికారులు, అధ్యాపకులు పెడమార్గము పడుతుంటే పిల్లలు యేవిధంగా సరైన మార్గంలో ఉంటారు? ప్రొఫెసర్లుగాని, టీచర్సుగాని మొట్టమొదట అణకువ సంపాయించాలి. ఐకమత్యమే మన బలము. ఆచరణయే దీని అభివృద్ధికి మూలకారణము. ఐకమత్యము లేక, ఆచరణ లేక కేవలము బజార్లో తిరిగో దున్నపోతులే. అవివేకులు. మనకు అణకువ లేకపోతే మితిమీరిన రాక్షసులైపోతాం.

విద్యారు&థలారా! మొట్టమొదట మీరు సాధించవలసినది అణకువ. అణకువ చాలా అవసరము. విద్యాసారమంతా అదే. అప్పుడే మనము విద్యావంతుడని అనిపించుకుంటాము. అణకువను సంపాయించుకోవాలి. నిరహంకారమును పోషించుకోవాలి. నిరాడంబరముగా మెలగాలి. అసూయ మనలో యేమాత్రమూ ప్రవేశించకూడదు. ఎవరో బాగుపడుతున్నారని మనం అసూయ పడకూడదు. ఎవరికో దండిగా మార్కులు వచ్చాయని అసూయ పడకూడదు. ఈ అసూయ అహంకారములకు మూలకారణం ఏమిటి? స్వార్థమే. ఈ స్వార్థమునకు చోటిచ్చినప్పుడు అనేక దుర్గుణములు ప్రవేశిస్తాయి.

విద్యార్థులారా! మూడు దినములు బ్రతికినా ఆదర్శవంతమైన విద్యార్థిగా మనం బ్రతకాలి. 'కాకివగుచు కలకాలము తిరుగక హంసవై క్షణమె ఆడుమురా!' విద్యారు&థలారా! ఈనాడు మహా పవిత్రమైన పర్వదినము. అనేకరకములైన ప్రాకృతమైన భోగభాగ్యములందించే దినము. భోగభాగ్యములందించే సంక్రమణం. అనేక పంటలతో చేరి ఉంటున్నాది.

దినకరుడు శాంతుడై తోచె దినములింక
కురచనయ్యె చలిగాలి చురుకు హెచ్చె
పొలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన
కుప్పలన్ నూర్పు కాపులు గొంతులెత్తి
పదములన్ పాడదొడగిరి పచ్చపూలు
జనపచేలకు ముత్యాల సరులుగూర్చె
మిరప పండ్లకు కుంకుమ మెరుపుదాల్చి
బంతిపువ్వుల మొగములల్లంత విప్పి
మన గృహంబుల ధాన్యసంపదలు నిల్పి
సరసురాలైన పుష్యమాసంబునందు
పరగనొప్పుచు సంక్రాంతి పండుగొచ్చె.

ప్రకృతిని అందముగా చేసే పుష్యమాసము. ప్రకృతి అందమును చూస్తున్నామేగాని మన హృదయానందము మనము యేమాత్రమూ చూడటం లేదు. హృదయానందము కావాలి. హృయానందము కావాలంటే పవిత్రమైన భగవత్ప్రేమ చేర్చాలి.

విద్యారు&థలారా! సమావేశమైన ప్రజలారా! మీరు ఈనాటినుండి యువకులలో ఉండే ఉత్సాహము, శక్తిసామర్థ్యములను వెలికి తీసి వీధివీధి, వాడవాడ భగవన్నామాన్ని ప్రచారం చేయాలి. ద్వేషము, అసూయ పూర్తి నిర్మూలం చేయాలి. పరమ ద్వేషి ఎదురైనా 'సాయిరాం' అని ఆనందంగా నమస్కరించాలి. ఎవరినీ ద్వేషించ వద్దు. నీకు యిష్టము లేకుంటే ఊరికే ఉండు. కాని, నామస్మరణ జగత్తంతా వ్యాపింపచేయాలి. ఈ పైనున్న తరంగములన్నీ విద్యుత్‌శక్తి తరంగములే. ఈ తరంగములు అపవిత్రం

కావటం చేతనే మన హృదయాలు అపవిత్రం అయిపోతున్నాయి. కనుక, వాతావరణము పవిత్రం గావించాలి. ఎట్లా అవుతుంది పవిత్రము? భగవన్నామముచేత ఈ తరంగములు యేకమైపోతాయి. మనము తీసుకునే నీరు మాలిన్యముతో ఉంటున్నాది. తినే అన్నము పొల్యూషన్. గాలి పొల్యూషన్. జీవితమే పొల్యూషన్ అయిపోయింది. దీన్నంతా పవిత్రము చేయాలినాడు. ఏరీతిగా చేయాలి? ఒక్క జభగవన్నామముతోనే చేయాలి. భగవన్నామము తప్ప పవిత్రము గావించే శక్తిసామర్థ్యములు మరొకదానికి లేదు. ఏనాడైనా మనము సంపాయించినది వదలి పోవలసినదే! ఎవ్వడూ ఇక్కడ శాశ్వతంగా ఉండేవాడు లేడు. అట్టి అశాశ్వతమైన తత్త్వములో శాశ్వతమైన బీజమును నాటాలి. అదే భగవన్నామము. ఆ నామాన్ని చక్కగా ప్రపంచమంతటా చాటాలి. వారిమాటలు, వీరిమాటలు మాట్లాడి కాలము వ్యర్థము చేసేదానికంచే భగవన్నామము చేత కాలము సార్థకము చేసుకోండి. మొట్టమొదట మనం నేర్చుకోవలసింది అహంకారము చంపుకోవాలి. అసూయ పూర్తి నిర్మూలనం చేయాలి. ఆడంబరము అణచి పెట్టాలి. అప్పుడే ఆనందము మననుంచి ఆవిర&భవిస్తుంది. ఈ ఆనందముచేత భగవన్నామము చింతించాలి.

(1995 జనవరి 14వ తేదీ ఉదయం పూర్ణచంద్రలో భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసం)